క్లుప్తంగా

వీడీసీ కార్యవర్గం ఎన్నిక

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెం గ్రామాభివృద్ధి కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా తాటికొండ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా తక్కల రవీందర్, కార్యవర్గ సభ్యులుగా ఆకుల మల్లేశం, గుజ్జుల గంగన్న, బంగారి ముత్యం, వేల్పుల మల్లేశం, చిన్నన్న, సాదు దేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులుగా తూముచారి, తాటికొండ సత్తెన్న, గంగన్న, సాదు రాజును ఎన్నుకున్నారు.

ప్రజాపాలన ఏర్పాట్లు

లోకేశ్వరం: మండలంలోని నగర్, సాథ్‌గాం గ్రామాల్లో జరిగే ప్రజాపాలన వేదికల ఏర్పాట్లను సోమవారం ఎంపీడీవో సోలమాన్‌రాజ్ పరిశీలించారు. దరఖాస్తుదారులకు ఇబ్బంది కల్గకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు అమ్మితే చర్యలు తప్పవని అన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

శాలివాహన కార్యవర్గం



ఎన్నికైన మండల కార్యవర్గం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో మండల శాలివాహన(కుమ్మరి) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆ సంఘం మండల గౌరవాధ్యక్షులు కొత్తపల్లి బుచ్చన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా డాక్టర్ కట్లకుంట గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ఆమెడ లక్ష్మణ్, గౌరవ సలహాదారులుగా అరిపెల్లి భోజన్న, అమెడ లక్ష్మణ్, కోశాధికారులుగా ఆమెడ శ్రీధర్, దేవన్న, రైటర్లుగా శ్రీనివాస్, రాజారం గజేందర్, సభ్యులుగా పద్మ, సాయన్న, చిన్నన్న, గంగాధర్‌ను ఎన్నుకున్నారు.

సన్మానం

లోకేశ్వరం: ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సాగర్‌ను మండలంలోని అబ్దుల్లాపూర్‌లో సోమవారం గంగపుత్రుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల సాహేందర్ ఘనంగా సన్మానించారు. ధర్మోర ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కల్యాణి అనిల్‌పటేల్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ఈనెల 3 నుంచి 5 వరకు నిర్వహించే శ్రీ వీరాంజనేయ, రేణుక ఎల్లమ్మ, పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు రావాలని గ్రామస్తులు సోమవారం తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, రమణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సదాశివ్‌పటేల్, గండె రాజేందర్, వీడీసీ చైర్మన్ మహేందర్, నర్సింలు తదితరులు ఉన్నారు.

నేడు కమిటీ ఎన్నిక

తానూరు: మండల కేంద్రంలోని బుద్ధవిహార్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు భారతీయ బౌద్ధమహాసభ మండల కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు మహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల బౌద్ధమహాసభ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

ఆలోచన అదిరింది



లక్ష్మణచాంద: వరినాట్ల సమయంలో పొలం దున్నేందుకు కేజీవీల్స్ ట్రాక్టర్లు ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లేటప్పుడు రోడ్లు ధ్వంసమయ్యేవి. పోలీసులు సైతం నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించి కేసులు నమోదు చేసేవారు. కానీ లక్ష్మణచాందలోని ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను పొలాల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక ట్రాలీ తయారు చేయించి రోడ్డు దెబ్బతినకుండా ఇలా తీసుకెళ్తున్నారు.

బాబోయ్ చలి..



తానూరు: ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో జనం గజగజ వణుకుతున్నారు. పొద్దంతా వ్యవసాయ పనులు చేసి ఇళ్లకు వచ్చిన గ్రామీణులు చలికి అల్లాడుతున్నారు. రాత్రి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. పంటల రక్షణకు కాపలా వెళ్లినవారు సైతం చలికి ఇబ్బంది పడుతున్నారు. ఉమ్రి(కే)లో ఇలా చలిమంట కాగుతూ జనం కనిపించారు.

వెదజల్లే విధానంతో సిరులు



పై చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు బన్నెబోయిన పోశెట్టి. లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌లో ఇతడు తనకున్న 28 ఎకరాల్లో ఈ యాసంగిలో 20 ఎకరాలు వడ్లు వెదల్లే విధానంలో వరి పంట సాగు చేస్తున్నాడు. గతేడాది యాసంగిలో 20 ఎకరాల్లో వెదజల్లే విధానంలో పంట సాగు చేయగా ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు ఈ రైతు తెలిపాడు.



పొట్టపెల్లి సమీపంలో వెదజల్లే పద్ధతిలో సాగవుతున్న వరి పంట

- తగ్గుతున్న పెట్టుబడులు.. పెరుగుతున్న దిగుబడులు
- నూతన పద్ధతిలో వరి సాగుకు రైతుల ఆసక్తి



రాచాపూర్‌లో పొలం దున్నుతున్న యువ రైతు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల రైతులు మూస ధోరణిలో కాకుండా వ్యవసాయాధికారుల సూచనల మేరకు వరిని సాధారణ పద్ధతిలో కాకుండా వడ్లు వెదజల్లే విధానంలో సాగు చేస్తూ అధిక లాభాలు పొందతున్నారు. పొలాన్ని ట్రాక్టర్‌తో దున్ని నారు పోసి కూలీలతో నాటు వేయడం వంటి పనులకు స్వస్తి చెప్పి దమ్ము చేసిన పొలంలో వడ్లు వెదజల్లే విధానంతో మంచి దిగుబడులు పొందుతున్నారు.

మండలంలో వెయ్యి ఎకరాల్లో సాగు..

లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి, లక్ష్మణచాంద, పీచర, ధర్మారం, పార్‌పెల్లి, చామన్‌పెల్లి, చింతల్‌చాంద తదితర గ్రామాల్లో రైతులు వెదజల్లే విధానంలో వరి పంట సాగు చేస్తున్నారు. గతేడాది యాసంగిలో 500 ఎకరాల్లో పంట సాగు చేయగా.. ఈసారి 1,000 ఎకరాలలో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

తగ్గుతున్న సాగు ఖర్చులు

సాధారణంగా వరి సాగు చేసే సమయంలో రైతులకు దుక్కిదున్నడం మొదలు.. నారుమడులు సిద్ధం చేయడం నారు పోయడం.. కూలీలతో నాట్లు వేయించడం జరుగుతుంది. నాటు సమయంలో కూలీల కొరత ఏర్పడటం వంటి సమస్యలు ఎదుర్కొంటాం. ఎకరం పొలం నాటు వేసేందుకు ఎనిమిది మంది మహిళా కూలీలకు రూ.4500 నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చవుతుంది. ఇద్దరు మగ కూలీల ఖర్చు అదనం. నారు పోస్తే ఎకరాకు 20 కిలోల వరి విత్తనాలు అవసరం కాగా.. వెదజల్లే పద్ధతిలో 12 కేజీలు మాత్రమే సరిపోతాయి. దీంతో అటు కూలీల ఖర్చులు, ఇటు విత్తనాల ఖర్చులు తగ్గుతున్నాయని రైతులు అంటున్నారు. వెదజల్లే పద్ధతిలో కేవలం నలుగురితో రెండెకరాల్లో విత్తనాలు చల్లడం పూర్తవుతుందని రైతులు తెలిపారు.

అధిక దిగుబడులు..

సాధారణ పద్ధతిలో కంటే వెదజల్లే విధానంతో ఎకరాకు ఐదు క్వింటాళ్ల వరకు అధిక దిగుబడి వస్తుంది. సాధారణ పద్ధతిలో ఎకరం పొలంలో 20 నుంచి 24 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. వెదజల్లే పద్ధతిలో 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో గ్రామాల్లో రైతులు ఈ విధానంలో సాగు చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు.

ఐదు క్వింటాళ్లు ఎక్కువ



గతేడాది యాసంగిలో 25 ఎకరాల్లో వెదజల్లే విధానంలో వరి పంట సాగు చేశా. ఎకరాకు సాధారణ పద్ధతిలో కంటే వడ్లు వెదజల్లే విధానంతో 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు అధిక దిగుబడులు వచ్చాయి. అధికారుల సూచనల మేరకు ఈసారి కూడా 24 ఎకరాల్లో సాగు చేస్తున్నా.

– నారాయణ, రైతు, పొట్టపెల్లి

అవగాహన కల్పిస్తున్నాం



మండలంలోని అన్ని గ్రామాల్లో క్లస్టర్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి వడ్లు వెదజల్లే విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు సైతం ఈ విధానంలో సాగుకు ముందుకొస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేస్తే ఎకరాకు రూ. ఐదు వేల వరకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు వస్తాయి.

– ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

కనుల పండువగా పడిపూజ



సోన్ : అయ్యప్ప పడిపూజలో స్వాములు

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం గ్రామంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి దత్తాత్రి, సాయిసూరజ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరంలో తొలిరోజు అయ్యప్పకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భజనల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గురుస్వాములు, వీడీసీ సభ్యులు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని జుట్టు అన్వేశ్ నివాసంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి చిత్రపటాలను అలంకరించారు. పంచామృతాలతో అభిషేకం చేశారు. గురుస్వాములు గజేందర్, సిర్యూర్ రాజేశ్వర్, ఉదయ్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



కుంటాల శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం న్యూఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కల్లూర్ శ్రీ దత్త వెంకటసాయి, కుంటాలలోని శ్రీ ఉమామహేశ్వర, శ్రీ మహాదేవ, శ్రీసూర్యాపూర్ రాజరాజేశ్వర, ఓలా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం, ఇలేగాం, మహాగాం, కామోల్, వానల్‌పాడ్, చింతల్‌బోరి, సిరాల, చుచుంద్‌తోపాటు ఆయా గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరం సుఖసంతోషాలతో ఉండాలని దేవుళ్లను మొక్కుకున్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయంలో డాంగే రమాకాంత్ పటేల్–గంగసాగర దంపతులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి ప్రణిత్ మహరాజ్ ఆధ్వర్యంలో శివలింగానికి బిల్వార్చన చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ దుర్గామాత ఆలయంలో, బాబాపూర్‌లో రాజరాజేశ్వర స్వామి ఆలయంలో, లక్ష్మణచాందలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, చామన్‌పెల్లి రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

మల్లికార్జున స్వామి ఉత్సవాలు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం గురువందనం, శాంతిపటం, పృథ్వీపూజ, కలశపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, జలాధివాసం, మంగళహారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మరో రెండు రోజులు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. లింగన్న, రాజేందర్‌యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

భీమా కోరేగావ్ అమరులకు నివాళి



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు




భైంసారూరల్: పూలమాల వేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో సోమవారం దళిత, గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భీమా కోరెగావ్ విజయోత్సవ దివస్ నిర్వహించారు. భీకర యుద్ధం చేసి భీమా కోరేగావ్‌లో పోరాడి గెలిచిన మహావీరుల త్యాగాలను నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా మహావీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ములుగూరి నవీన్, బొమ్మెన రాజ్‌కుమార్, బానావత్ గోవింద్, సమీ, రాజన్న, సురేశ్, రాజేశ్వర్, శంకర్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: భీమా కోరేగావ్ స్ఫూర్తితో ముందుకెళ్దామని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షులు ప్రసంజిత్ హేమ్లే అన్నారు. సోమవారం మండలంలోని పేండ్‌పెల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం, బీఎస్ఐ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మోహన్, గంగాధర్, గోపి, ఎల్లన్న, భోజన్న, సాయన్న, పలువురు బౌద్ధ ఉపాసకులు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో సోమవారం శౌర్య దివస్ నిర్వహించారు. బీఎస్ఐ ఆధ్వర్యంలో నాగార్జుననగర్‌లో ఉన్న జంబుద్వీప్ బుద్ధవిహార్ ఆవరణలో భీమా కోరేగావ్ శౌర్య దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు బాబు వాగ్మారే, తదితరులున్నారు.

ఘనంగా న్యూఇయర్ వేడుకలు



ఖానాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎస్సై, సిబ్బంది



కుంటాల : కల్లూర్ కస్తూర్బాలో విద్యార్థులు

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఎస్సై జి.లింబాద్రి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. వాహన తనిఖీల అనంతరం అర్ధరాత్రి 12 గంటల తర్వాత పోలీసు సిబ్బంది కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో సోమవారం నిర్మల్ ట్రాఫిక్ పోలీసులు యాచకులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, సిబ్బంది నవీన్‌సింగ్, అజార్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ కస్తూరిబాలో సోమవారం కేక్ కట్ చేసి సందడి చేశారు. విద్యార్థులు ఎస్ఓ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలో న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువత ఆదివారం అర్ధరాత్రి కేక్ కట్ చేసి నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో సోమవారం న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌హైదర్ కేక్ కట్ చేశారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరశెట్టి రవి, మహమ్మద్ షఫీ, ఇమ్రాన్, కరీం, సయ్యద్, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

తానూరు: మండలవ్యాప్తంగా న్యూఇయర్ వేడుకలను జరుపుకొన్నారు. బోరిగాంలోని మహాదేవుడి ఆలయంలో ప్రజలు పూజలు చేశారు.

రాములోరి అక్షింతలు పంపిణీ



కుంటాల: కల్లూర్ శోభాయాత్రలో మహిళలు



తానూరు: శోభాయాత్రలో భక్తుల భజనలు



నిర్మల్‌లో అక్షింతలు అందిస్తున్న బీజేపీ నేతలు

భైంసాటౌన్: శ్రీరామ జన్మభూమి క్షేత్ర తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలు ఇటీవల భైంసా పట్టణం చేరిన విషయం తెలిసిందే. ట్రస్టు సభ్యులు సోమవారం పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ భక్తులకు అక్షింతలు అందజేశారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామానికి సోమవారం అయోధ్య అక్షింతలు చేరుకున్నాయి. మహిళలు మంగళహారతులతో, అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు శోభాయాత్ర వెళ్లి స్థానిక శ్రీ దత్త వెంకటసాయి ఆలయంలో అక్షింతలను భద్రపరిచారు.

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండా, సాయినగర్ తండాలో అయోధ్య అక్షింతలకు పూజల అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. సర్పంచ్ జాదవ్ అంజనాబాయి, శంకర్‌నాయక్, రాము, సుభాష్, కైలాశ్, వినేశ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని మాటేగాం, వాలేగాం గ్రామాల్లో అయోధ్య అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామస్తులు మంగళహారతులతో శోభయాత్ర నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావు పటేల్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని మహలింగిలో అయోధ్య అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. మంగళహారతులు, భజనల నడుమ ఇంటింటా పంపిణీ చేశారు. వీడీసీ అధ్యక్షుడు కృష్ణపటేల్, పోశెట్టి, రాకేశ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో హిందూ వాహిని ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈనెల 15వరకు గడపగడపకు అక్షింతల వితరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాటివార్ సాయినాథ్, రమేశ్, పోతన్న, దశరథ్, భూమేష్, శ్రీనివాస్, సారథిరాజు, హిందువాహిని సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, గోసంపల్లె గ్రామాల్లో విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు రాములోరి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. శివారు నుంచి ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని గాంధీచౌక్‌లోని హనుమాన్ ఆలయం నుంచి నాయుడువాడ ప్రజలు అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. పూజల అనంతరం గడపగడపకూ అక్షింతలను పంపిణీ చేశారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ప్రియదర్శినీనగర్‌లో వీధుల గుండా అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భీమ్‌రావు, గోవిందరావు, సురేశ్, నూకల నందకుమార్, గంగయ్య, భూమయ్య పాల్గొన్నారు. స్థానిక ఉమామహేశ్వరాలయంలో అయోధ్య అక్షింతలకు పూజలు చేసి నటరాజ్‌నగర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు. కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు శాంతిలాల్ పటేల్, నాగభూషణం, అయ్యన్నగారి శ్రీధర్, ప్రభు, చరణ్, నారా యణ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్: మస్కాపూర్‌లో భక్తుల ఊరేగింపు



నర్సాపూర్(జి): అంజనీతండాలో..



భైంసారూరల్: మాటేగాంలో గ్రామస్తులు

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన



ముస్తాబైన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి, రేణుక ఎల్లమ్మ, పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను ఈనెల రెండో తేదీ నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మంగళవారం దేవతామూర్తుల ఊరేగింపు, బుధవారం వేదపఠనం, స్వస్తివచనం, గణేశారాధన, పుణ్యాహవచనం, కౌశికబంధనం, స్థలసంప్రోక్షణ, యాగమండప ప్రవేశం, మండపారాధన, షోడశ మాతృక, మండపారాధన, భద్ర మండల, క్షేత్రపాలక, మండపారాధన, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, దేవతామూర్తుల మంత్రహవనం, జలాధివాసం, హారతి, మంత్రపుష్పం, ప్రసాదం, ఈనెల 4న దేవతా రాధన, రుద్ర ఆంజనేయ, రేణుకమంత్ర హవనం, చండీ హోమం, ధాన్యాధివాసం,హారతి, మంత్రపుష్పం.. ఈనెల 5న ఉదయం స్వస్తిహవచనం దేవతారాధన, హోమం, యంత్రమూర్తి, స్థాపన, ఆరాధన, ప్రాణ ప్రతిష్ఠ, ధృగ్‌బలి, పూర్ణాహుతి, దేవతవిసర్జన, ప్రోక్షణ, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరిస్తాం



నారాయణ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పంచగుడి పంచాయతీ ఆవరణలో ఇన్‌చార్జి ఎంపీపీని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచగుడి ఎత్తిపోతల పథకంతో చివరి ఆయకట్టుకు నీరందించేలా కృషి చేస్తామన్నారు. పంచగుడి వంతెన రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు నష్టపోయిన వారికి ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పంచగుడిలో మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లన్న, ఉపసర్పంచ్ ఇంద్రకరణ్‌గౌడ్, పలువురు గ్రామస్తులు నారాయణ, సాగర్‌గౌడ్, లింగన్న, ఉదయ్, పోశెట్టి, నర్సింలు ఉన్నారు.

ఓ మై 'గుడ్డో'!



- కొండెక్కుతున్న కోడిగుడ్డు ధర

నిర్మల్‌ఖిల్లా: మధ్యతరగతి కుటుంబాలకు కూర అనగానే టక్కున గుర్తొచ్చే వంటకం కోడిగుడ్డు. పలు పోషకాలు కల్గిన కోడిగుడ్డును ఉడికించి కూడా చిన్నారులతో పాటు పెద్దలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. కానీ ప్రస్తుత మార్కెట్లో ఒక కోడిగుడ్డు ధర ఏకంగా రూ.ఏడు పలుకుతోంది. మొన్నటి వరకు ఒక్కో కోడిగుడ్డు ధర రూ.5 నుంచి 6కు లభించేది. కానీ వారంరోజుల వ్యవధి లోనే ఏకంగా డజన్ గుడ్ల ధర రూ.80కి చేరింది. జిల్లాలో కోడిగుడ్ల పౌల్ట్రీఫాంలు తక్కువగా ఉండడంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కోళ్లదాణా ధరలు పెరగడం, చలి ప్రభావంతో కోళ్ల మృతి చెందడం కూడా ధరల పెరుగుదలకు కారణమని పౌల్ట్రీ పరిశ్రమ యజమానులు పేర్కొంటున్నారు.